
ప్రజాశక్తి

శనివారం 22 ఫిబ్రవరి 2025 | 5

పార్వతీపురం మన్యం



25న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

పార్వతీపురం : ఈ నెల 25న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను పార్వతీపురం డివిజన్ పరిధిలోని సాలూరు సబ్ డివిజన్ కార్యాలయం (33/11కెవి సబ్ స్టేషన్)లో నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.గోపాలరావు నాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ వినియోగదారులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, వోల్టేజ్, మీటర్ రీడింగ్‌లో అవకతవకలు వంటి సమస్యలను ఎదుర్కొంటున్న వారు తక్షణమే పరిష్కరించుకోవాలని అన్నారు. విద్యుత్ చార్జీలను సకాలంలో చెల్లించాలని వినియోగదారులకు సూచించారు. ఈ కార్యక్రమానికి సిజిఆర్‌ఎఫ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు బి.సులోచనారాణి, ఆర్థిక సభ్యులు షేక్ బాబర్, స్వతంత్ర సభ్యులు ఎన్. మురళీకృష్ణ హాజరవుతున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

ఉపాధ్యాయ ఉద్యమాల్లో మేటి విజయగౌరి

ఎమ్మెల్సీ ప్రచారంలోనూ అదే జోరు
అడుగడుగునా ఆదరణ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పదవి వచ్చాక ఏం చేస్తామో చెప్పడం వేరు... పదవి లేకపోయినా సమస్యలపై పోరాడి సాధించి చూపించడం వేరు... పదవుల అనుభవించినా ఏమీ చేయలేక అచేతనంగా ఉండిపోవడం వేరు... ఇందులో రెండో కోవకు చెందినవారే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి. మాజీ ఎమ్మెల్సీలు మూడో కోవలో ఉంటా రని వేరేగా చెప్పనక్కర్లేదు. మిగిలిన వారంతా మొదటి కోవలో ప్రచారం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విజయగౌరి తరపున ఎన్నికల ప్రచారం కూడా అదో జోరులో సాగుతోంది. అందుకు తగ్గట్టే ఓటర్ల నుంచి ఆదరణ లభిస్తోంది.



సిపిఎస్ పోరులో అగ్రభాగానున్న విజయగౌరి (ఫైల్)

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలో 10మంది అభ్యర్థులు బరిలో నిలిచిన విషయం విధితమే. ఇందులో యుటిఎఫ్ సహ పలు ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలోవున్న కోరెడ్ల విజయగౌరి, పిఆర్‌టియు అభ్యర్థి శ్రీనివాసులు నాయుడు, ఎపిటిఎఫ్ అభ్యర్థి రఘువర్మ మధ్య ప్రధాన పోటీ కనిపిస్తోంది. వీరిలో శ్రీనివాసులు నాయుడు, రఘువర్మ ఇంతకు ముందు ఎమ్మెల్సీలుగా పనిచేసినవారే. ఉపాధ్యాయ సమస్యలపైగానీ, విద్యారంగ పరిరక్షణకు గానీ పెద్దగా కృషి చేసిన పరిస్థితు లేమీ లేదు. మరో మాటలో చెప్పాలంటే పాలకపార్టీలు చెప్పినట్టుగానే నడుచుకున్నారు. వీరిపై పోటీకి తలపడుతున్న విజయగౌరి చరిత్ర అందుకు భిన్నం. ఇంతకు ముందు ఎమ్మెల్సీగా పనిచేయకపోయినప్పటికీ యుటిఎఫ్ నేతగా దాదాపు 30ఏళ్లగా ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తున్నారు. రేషనలైజేషన్ పేరిట పాఠశాలల కుదింపు, క్లస్టర్ పాఠశాలల విధానం వంటివాటిపై ఉద్యమాలు ముందుకు నడిపేందుకు చొరవ చూపారు. జిఒ నెంబర్ 72కు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటంలో పోలీసులు అక్రమ కేసులు బనాయించినా వెరవలేదు. 2017లో అక్రమ బదిలీలపై జరిగిన ఉపాధ్యాయుల ఆందోళన కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయ నేతగా నాయకత్వం వహించారు. అప్పట్లో పెట్టిన కేసు ఏడేళ్లపాటు నడిచింది. పేదలను విద్య నుంచి దూరం చేసే నూతన విద్యా విధానంపై జరిగిన పోరాటంలోనూ ఎంతో చురుకుగా పనిచేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ నిర్భందాలు, బెదిరింపులు, కేసులు ఎదుర్కొన్నారు. అంతేకాదు జాతీయ విద్యా విధానం అమలు, 117 జీవోతో పాఠశాలల ఎత్తివేతకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమించారు. ఐటిడిఎ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై చేపట్టిన ఉద్యమాలను ముందుండి నడిపించారు. కెజిబివి, మోడల్‌స్కూళ్ల ఉపాధ్యా యులకు మినిమం స్కేల్ ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన పోరాటాల్లోనూ విజయగౌరి అగ్రభాగాన నిలిచారు. అంతేకాదు కరోనా సమయం లోనూ యుటిఎఫ్ తరపున ఆమె ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు సహాయ సహకారాలు అందించారు. ఈ నేపథ్యంలో విజయగౌరి పోరాట చరిత్రను, ప్రస్తుత, గత ఎమ్మెల్సీల పనితీరును ఉపాధ్యాయులు బేరీజు వేసుకుంటున్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలంటే, ఉపాధ్యాయుల హక్కులను నిలబెట్టు కోవాలన్నా విజయగౌరిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని చర్చించుకుంటున్నారు.

ఆరోగ్య కేంద్రాలు ఆదర్శంగా నిలవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల ఆప్యాయతను చూపి మెరుగైన వైద్య సేవలు అందించడంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. మండలంలోని రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌పేషంట్ల విభాగం, వ్యాక్సినేషన్, ల్యాబ్ టెక్నీషియన్, ల్యాబ్ గదులను పరిశీలించారు. అడల్ట్ ఫ్రెండ్లీ హెల్త్ క్లినిక్ ను సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో మందుల నిల్వ, రక్తపరీక్షలు, వాక్సినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సికిల్‌సెల్ ఎనీమియా బాధితుల వివరాలు, టీబీ రక్త నమూనా పరీక్షల సమగ్ర వివరాల రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారు. మందులు, యాంటీ స్నేక్ వీనం, రాబిస్ వ్యాక్సిన్ల కొరత ఏమైనా ఉందా అన్న విషయాలను ఫార్మసిస్ట్ సుకన్యను ప్రశ్నించారు. పిహెచ్‌సిలో ప్రసవాలపై ఆరా తీయగా గర్భిణీలకు అవగాహన కల్పించడంతో ప్రసవాలు గణనీయంగా పెరిగాయని వైద్యులు కె.కీర్తి, కె.కార్తీక్ తెలిపారు. పిహెచ్‌సి అన్ని విభాగాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణను పరిశీలించి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే విధంగా పరిశుభ్ర వాతావరణం కల్పించి మెరుగైన వైద్యమందించాలని సిబ్బందిని అభినందించారు.



పిహెచ్‌సిలో మందుల వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో మలేరియా కేసులు అరికట్టేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎనీమియా కేసులను గుర్తించి రక్తహీనతను అధిగమించేందుకు ఎనీమియా యాక్షన్ కమిటీ సమర్థంగా పనిచేయాలన్నారు. పాఠశాల విద్యార్థులకు హిమోగ్లోబిన్ స్థాయిల రక్త పరీక్షలు నిర్వహించి చిన్నారుల్లో ఆరోగ్యం మెరుగుకు న్యూట్రి కిట్స్ ను అందించాలన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పక్కగా జరగాలని ఆయన ఆదేశించారు. అసంక్రమిత వ్యాధులు (ఎన్ సి డి - నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్)పై ప్రత్యేక దష్టి సారించాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం నిర్మాణం పూర్తి దశలో ఉన్న ఐసోలేషన్ వార్డు భవనాన్ని పరిశీలించారు. విద్యుత్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని వైద్యులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అక్కడే ఉన్న విద్యుత్ ఎఇని తక్షణమే విద్యుత్ సౌకర్యం కల్పించి వైద్యసేవలందించేందుకు వీలుగా భవనాన్ని అప్పగించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారి ఒ.ప్రభాకరరావు, తహశీల్దార్ పి.బాలా, ఎంపిడిఒ జి.పైడితల్లి, మండల వ్యవసాయ అధికారి విజయభారతి, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు,



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి, ఎఎస్‌పి అంకిత సురానా

సంఘ విద్రోహులకు దూరంగా ఉండాలి

వాలీబాల్ విజేతలకు ఎస్‌పి బహుమతి ప్రదానం

ప్రజాశక్తి - సాలూరు

విద్యార్థులు, యువకులు సంఘవిద్రోహ శక్తులకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి కోరారు. మండలంలోని తోణాం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల మైదానంలో నిర్వహించిన సబ్ డివిజన్ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ఎఎస్పీ అంకిత సురానాతో కలిసి ప్రారంభించారు. మొత్తం 114 జట్లు పాల్గొనగా వాటిలో సాలూరు మండలం దిగువ మెండంగి, మక్కువ మండలం కోన గ్రామం జట్లు ఫైనల్‌కు చేరాయి. ఫైనల్‌లో విజేతగా నిలిచిన దిగువ మెండంగి జట్టుకు రూ.3వేలు నగదు, ట్రోఫీ, వాలీబాల్ కిట్లును ఎస్పీ మాధవరెడ్డి అందజేశారు. రన్నర్‌గా నిలిచిన కోన జట్టుకు రూ. 2వేలు నగదు, ట్రోఫీ, వాలీబాల్ కిట్లును ఎఎస్పీ అంకిత సురానా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సంఘ విద్రోహ కార్యక్రమాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, సారాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని కోరారు.

కార్యక్రమంలో రూరల్ సిఐ రామకృష్ణ, కొటియా సిఐ గోవిందరావు, ఎస్సైలు నర్సింహమూర్తి, వెంకటరమణ, వెంకట సురేష్ పాల్గొన్నారు.



చింతపల్లి మండలం వంగసార బాలికల ఉన్నత పాఠశాలలో ప్రచారం నిర్వహిస్తున్న విజయగౌరి

విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తా

- గిరిజన ఉపాధ్యాయుల గొంతునవుతా
- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి
- ఏజెన్సీలో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - అరకులోయ

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తానని యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. ఆమె శుక్రవారం అల్లూరి జిల్లాలోని చింతపల్లి, హుకుంపేట, అరకులోయ మండలాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలు పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులను కలిసి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ క్రమంలో అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంతో తీవ్ర నష్టం జరుగనుందని, దీనికి వ్యతిరేకంగా పోరాటం చేస్తానని అన్నారు. 117 జిఒను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీన్ని రద్దు చేసినట్టు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ నిజానికి ఆ జిఒ రద్దు కాలేదని తెలిపారు. ప్రత్యామ్నాయంగా కొన్ని అంశాలను తీసుకొచ్చి అమలు జరుపుతున్నారన్నారు. దీని వల్ల ప్రాథమిక, మాధ్యమిక విద్యకు ప్రమాదం వాటిల్లనుందన్నారు. హైస్కూల్‌లో పదో తరగతి పాస్ అయిన తర్వాత చదువుకునేందుకు పెట్టిన ఇంటర్మీడియట్ వ్యవస్థను రద్దు చేయాలనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుందని, దాన్ని రద్దు చేయకుండా కాపాడుకోవడానికి ప్రయత్నం చేస్తామని చెప్పారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణకు కృషి చేస్తానన్నారు. కెజిబివిల్లో మినిమం టైం స్కేల్ అమలు చేయకుండా అక్కడి ఉద్యోగులను ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోందన్నారు. ఆదివాసీలకు ఏజెన్సీలో శత శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించే జిఒ నెంబర్ 3ని పునరుద్ధరించాలని శాసన మండలిలో గొంతెత్తుతానన్నారు. ప్రభుత్వం 1/70 చట్టానికి సవరణ చేయాలన్న ప్రయత్నాన్ని మానుకోవాలన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల గొప్పతనాన్ని గుర్తుచేశారు. ఏజెన్సీలో జరిగిన ప్రచార కార్యక్రమాల్లో యుటిఎఫ్, ఐద్వా, సిఆర్‌టిల సంఘం, సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం గిరిజన సంఘం, జనవిజ్ఞాన వేదిక నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలి

ప్రజాశక్తి - కురుపాం

మన్యం జిల్లా అభివద్ధికి రాష్ట్రబడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జియ్యమ్మవలస మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ రెడ్డి పకీరుకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యం జిల్లా తీవ్రమైన అన్యాయానికి గురైందని, పాలించిందెవరైనా అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. బడ్జెట్లో కేటాయింపులుండవని, ఒకవేళ కేటాయించినా ఖర్చు చేయరని అన్నారు. పాలకుల వివక్షతోనే ఈనాటికీ జంఝావతి అలాగే ఉందన్నారు. అలాగే అడారుగెడ్డ, పెద్దగెడ్డ, వెంగళారాయ, తోటపల్లి, గుమ్మిడిగెడ్డ, పాలగెడ్డ, కంచరుగెడ్డ, జంపరుకోట ప్రాజెక్టుకు నిధులు కేటాయించలేదని, రెండు దశాబ్దాలైనా తోటపల్లి, పెద్దగెడ్డ నిర్వాసితుల పునరావాసం పూర్తి చేయలేదన్నారు. కాలువలు పూర్తి చేయరని, గుమ్మడి గెడ్డపై ప్రాజెక్టు నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారో తెలీదని విమర్శించారు. ఈ జిల్లాలో యూనివర్సిటీ, పీజీ, మెడికల్ కాలేజీల్లేవని, దీంతో ప్రైవేట్ కాలేజీల్లో వేలకు వేలు డబ్బులిచ్చి చదువుకోవాల్సి వస్తుందని తెలిపారు. విద్యావసతి, ఫీజు రీయింబర్స్మెంట్ కూడా రాదని, పేదలైన జిల్లా ప్రజలు చదివేది ఎలాగని ప్రశ్నించారు. నియోజకవర్గ కేంద్రాలైన సాలూరు, పాలకొండ, కురుపాంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లు లేకపోవడంతో అనారోగ్యం చేస్తే పేదలను విజయనగరం, విశాఖ కెజిహెచ్‌కు పంపిస్తున్నారని, కావున గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలందేలా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని, కావున బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లన్నీ పూర్తి చేయాలంటే మన్యం జిల్లాకు రూ.10 వేల కోట్లు కేటాయిస్తే జిల్లా సస్యశ్యామలవుతుందన్నారు. ఇప్పటికైనా బడ్జెట్లో నిధులు కేటాయించాలని, లేకుంటే భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.సీతారాం, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం : జిల్లాలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు మెడికల్ కాలేజీ, హాస్పటల్స్, రోడ్లు యూనివర్సిటీ, మంచినీటి సౌకర్యం ఇతర అభివద్ధి కార్యక్రమాల బడ్జెట్ నిధులు కేటాయించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం స్పెషల్ డిప్యూటీ కలెక్టరుకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిరా, కె.రామస్వామి, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలో జీడి పిక్కల ప్రోసెసింగ్ యూనిట్ గిరిజన ప్రాంతంలో ఏర్పాటు చేయాలని, చింత పండు, పైనాపిల్ ఇతర అటవీ ఉత్పత్తులకు చిన్న, చిన్న గృహ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, ఎన్సీఎస్ షుగర్స్, సాలూరు జూట్ ఫ్యాక్టరీలు ప్రభుత్వ పరం చేయాలని, పూర్ణ పాడు - లాబేసు వంతెన, పార్వతీపురం బైపాస్ రోడుతో పాటు, గిరిజన ప్రాంతాల్లోని ఉన్న రోడ్డులు, మంచి నీటి కొరకు రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, పడాల రాజశేఖర్, పాలమిట్ట రాము, కద్రక చిరంజీవి, తాడంగి కష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : జిల్లా సమగ్రాభివృద్ధికి బడ్జెట్లో రూ.10వేల కోట్లు కేటాయించాలని, పాలకొండ మండల అభివృద్ధికి తోడ్పడేలా నిధులు సమకూర్చాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. అనంతరం డిటికి వినతిపత్రం అందజేశారు. ధర్నాను ఉద్దేశించి సిపిఎం నాయకులు దావాలా రమణారావు మాట్లాడుతూ పాలకొండ పట్టణం రోడ్డు విస్తరణ, బైపాస్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, రైతు బజారు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం, వివిధ ప్రజా సంఘాలు నాయకులు అర్తమూడి లక్ష్మణరావు, మల్లవరపు రమేష్, కాదా రాము, ఎస్ నారాయణరావు, ఎ.భాను సుందర్, ఎస్.మజ్జియ్య, వి.చంప, చిన్నారావు, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మన్యం జిల్లా అభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించాలని కోరుతూ స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం నాయకులు రెడ్డి వేణు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాకు రాష్ట్ర బడ్జెట్లో పదివేల కోట్ల రూపాయలు కేటాయించి పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు, మెడికల్ కాలేజీ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని మెడికల్ కాలేజీగా మార్చాలని, జిల్లాలో యూనివర్సిటీ, పార్వతీపురం, పాలకొండ కురుపాంలో పిజి కాలేజీ, గిరిజన యూనివర్సిటీ, ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, సిఐటియు నాయకులు గవర వెంకటరమణ, కౌలు రైతు సంఘం నాయకులు రెడ్డి రమణమూర్తి, రైతు సంఘం నాయకులు బి.అప్పారావు,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సిహెచ్.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : రానున్న రాష్ట్రబడ్జెట్‌లో జిల్లాకు నిధులు కేటాయించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, అనంతరం కొమరాడ తహశీల్దార్ శివయ్యకు వినతి పత్రం అందజేశారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ వెనుకబడిన పార్వతీపురం మన్యం జిల్లాకు రూ.10వేలు కోట్లు మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రెడ్డి శివున్నాయుడు, పలువురు రైతులు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు
పలుచోట్ల ధర్నాలు, నిరసనలు



జియ్యమ్మవలసలో డిటికి వినతిని అందజేస్తున్న సిపిఎం జిల్లాకార్యదర్శి గంగునాయుడు





సీతానగరం, పాలకొండ తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

చెట్టు కిందే చదువులు

గిరిజన విద్యార్థులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - సాలూరు

'పేద విద్యార్థుల చదువుకు పెద్దపీట వేస్తున్నాం... ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తీర్చుదిద్దు తున్నాం..' అంటూ అనేక సమావేశాలు, సభలుల్లో పాలకులు, అధికారులు చెబుతున్న మాటలు నీటి మూటలుగానే మిగులు తున్నాయి. వీరి మాటలకు, చేతలకు ఎలాంటి పొంతనా లేదని అర్థమవుతోంది. సాలూరు మండలంలోని తోణాం పంచాయతీ మెట్టవలసలో చెట్ల కింద నిర్వహిస్తున్న తరగతులు, చిన్నారులు చదువు కోసం పడుతున్న అవస్థలే ఇందుకు నిదర్శనం...

మండలం లోని తోణాం పంచాయతీ మెట్టవలస లో చెట్టు కిందనే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నడుస్తోంది. పక్కా భవనం లేక పోవడంతో ఆరుబయటే విద్యార్థులు చదువు కుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. రెండేళ్ల క్రితం ఈ గ్రామంలో ఉండే ఆర్‌సిఎం పాఠశాల భవనం శిథిలమైంది. దీంతో ఈ పాఠశాలను ఎంపిపి పాఠశాలగా మార్చారు. అయితే పాఠశాల భవనం లేకపోవడంతో కొద్ది నెలలుగా గ్రామంలో ఉన్న జిసిసి డిపో ఆవరణలో పాఠశాల నిర్వహణ జరిగేది. దీనిపై పత్రికలో వార్త రావడంతో జిసిసి డిపో నుంచి విద్యార్థులను వెళ్లగొట్టారు. గత్యంతరం లేక గ్రామంలో ఉన్న చెట్టు కింద పందిరిలోనే చిన్నారులు చదువు కోవాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామంలో 52మంది విద్యార్థులు చదువుతున్నా సొంత భవనం లేకపోవడంతో ఉపాధ్యాయుడు చెట్టు కిందనే ప్రభుత్వ బడి నడిపించాల్సిన పరిస్థితి దాపురించింది. పాఠశాల భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు కోరు తున్నా ఫలితం లేకపోవడంతో గిరిజన విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు.



మెట్టవలసలో చెట్టుకింద విద్యార్థులు పాఠాలు చెబుతున్న టీచర్

త్వరితగతిన మ్యూటేషన్ల సమస్యలు పరిష్కారం

జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం

రెవెన్యూ సదస్సులు, గ్రామసభల్లో వచ్చిన మ్యూటేషన్ల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు.శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూకు చెందిన పలు అంశాలపై జెసి ఎస్‌ఎస్ శోభికతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలన్నింటిని పీజీఆర్ఎస్‌లో కాకుండా సర్వీసెస్‌లో నమోదు చేయాలన్నారు. ఖచ్చితమైన ప్రజా సమస్యలను పీజీఆర్ఎస్‌లో నమోదు చేయాలని సూచించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ ఫిర్యాదులను, పిజిఆర్ఎస్‌లో వచ్చిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని, ఆ దిశగా సబ్ కలెక్టర్లు, అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ హితవు పలికారు. మృతి చెందిన రైతుల మ్యూటేషన్లు, న్యాయపరంగా ఎటువంటి సమస్యలు లేని భూములకు చెందిన మ్యూటేషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఇప్పటి వరకు రెవెన్యూ సదస్సులు, గ్రామసభల్లో వచ్చిన సమస్యలను ఆయా విఆర్‌ఒల లాగిన్లో పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రత్యేక భూకేసులకు సంబంధించి శిక్షణ ఇచ్చి వాటికి పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ సర్వీసులను ప్రారంభించిందని, జిల్లాలో రెవెన్యూ, దేవాదాయ, ఇతర సర్వీసులకు సంబంధించి ఎనాబుల్ చేసిందని పేర్కొన్నారు. వాట్సాప్ ద్వారా ప్రజలకు అందబోయే సర్వీసులు ప్రజలందరికీ తెలియజేయాలన్నారు. ఇందుకు మండల కార్యాలయాలు, సచివాలయాల వద్ద బోర్డులను ఏర్పాటుచేయాలన్నారు. వాట్సాప్ ద్వారా అందించే సేవలపై వచ్చే వారం శిక్షణ ఉంటుందని, తద్వారా సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవలపై క్యూఆర్ కోడ్, ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి స్పందనను తెలుసుకుంటుందని, తద్వారా జిల్లాకు ర్యాంకులు ప్రకటించనుందని అన్నారు. కావున దీనిపై అధికారులు దృష్టి సారించాలని చెప్పారు. అన్ని కార్యక్రమాల్లో జిల్లాను మంచి స్థానంలో నిలిపేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్‌ఒ కె.హేమలత, కెఆర్‌ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శ్రీనివాసరావు, జిల్లా సహకార అధికారి పి.శ్రీరామమూర్తి, తహశీల్దారులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా మాతృభాషా దినోత్సవం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని శుక్రవారం అన్ని పాఠశాలల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ తెలుగులో మాట్లాడితే తెలుగు నిలబడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఇన్చార్జి ప్రిన్సిపల్ వి.ప్రభాకరరావు అధ్యక్షతన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మాతృభాషా ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాతృభాషా తీయనైనదన్నారు. ఈ సందర్భంగా తెలుగు అధ్యాపకులు డాక్టర్ విజయలక్ష్మి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతరులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీన ప్రక్రియ మానుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలల్లోకి విలీన ప్రక్రియ మానుకోవాలని టిఆర్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం కురుపాంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజన గ్రామాల్లో పాఠశాలలు విలీనం చేయడం వల్ల విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతూ విద్యకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2,3 కిలోమీటర్ల దూరం ఉన్న పాఠశాలలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి వస్తుందని అలా జరగడం వల్ల పిల్లలు డ్రాపౌట్లుగా మిగిలిపోతారని, కావున కూటమి ప్రభుత్వం విలీన ప్రక్రియను వెనక్కి తీసుకోవాలని గిరిజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎక్కడ పాఠశాల అక్కడే విలీనం చేయకుండా ఉంటే విద్యా వ్యవస్థకు దూరం కాదని తెలిపారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే పిల్లల తల్లిదండ్రులు, గిరిజన సంఘాల ద్వారా పెద్ద ఎత్తు ఎంఇఒ, కలెక్టర్, ఐటిడిఎ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో టిఆర్ఎఫ్ నాయకులు డి.సీతారాం, రోజు లోవరాజు, ఆరిక చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రూ.1.5 కోట్లతో పల్లెపండగ పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.1.5 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బిటివాడలోని రూ.11 లక్షలు, బూరుగలో రూ.20 లక్షలు, గడగమ్మలో రూ.10 లక్షలు, కంబరలో రూ.25 లక్షలు, కొట్టుగుమ్మడలో రూ.25.5 లక్షలు, ఎం.రాజపురంలో రూ.50 లక్షలు, బొడ్డపాడులో రూ.12 లక్షలతో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.


ఆధార్ నమోదును పరిశీలిస్తున్న ఎంపిడిఒ గీతాంజలి

ఆధార్‌కు ఫోన్ నంబరు జోడించాలి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ప్రజలంతా తప్పనిసరిగా ఆధార్ నెంబర్‌కు ఫోన్ నెంబర్లు జోడించాలని ఎంపిడిఒ కె.గీతాంజలి అన్నారు. మండలంలోని సీతంపేట-1, గొయిది, కిల్లాడ, ధారపాడు సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి వ్యక్తికి ఆధార్ నమోదు తప్పనిసరిగా ఉండాలన్నారు. సీతంపేట మండల ప్రజలంతా తప్పనిసరిగా ఆధార్ నమోదు చేయించుకోవాలని, దీన్ని వినియోగించుకోవాలని కోరారు. ముఖ్యంగా చిన్నపిల్లలు ఆధార్ నమోదు లేకుండా ఉన్నవారు తప్పని సరిగా దగ్గరలోని ఆధార్ నమోదు కేంద్రానికి తీసుకొచ్చి వారికి ఆధార్ నెంబర్ వచ్చేలా చూడాలన్నారు. ఎంపిడిఒ వెంట సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులను ఈనెల 24 నుంచి స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ నోటిఫికేషన్ ప్రకారం అర్హత కలిగిన విద్యార్థులు ముందుగా వివరాల కోసం www.cse.ap.gov.in వైబ్ సైట్‌లో పూర్తి సమాచారం కోసం చూసి దరఖాస్తు చేసుకోవాలని, ఇంకా ఏమైనా సందేహాలుంటే పాఠశాల పని దినాల్లో వచ్చి సంప్రదించాలని అన్నారు.



ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, నిబద్ధతతో చదువుకున్నప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకొని జీవితంలో స్థిర పడగలరని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టి.శ్రీవరం అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువు పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి విద్యార్థి గురువులను, తల్లిదండ్రులను గౌరవించినప్పుడే సమాజంలో మంచి పౌరులుగా గుర్తింపబడతారని అన్నారు. అనంతరం విద్యార్థులు పలు సంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పోటీల్లో గెలుపొందిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపల్ డి.రామయ్య, సిపిడిసి సభ్యులు గుడ్ల హరిప్రసాద్, ప్రిన్సిపల్ ప్రసాదరావు, జనార్ధన్, రిటైర్డ్ ప్రిన్సిపల్ వెంకట్రావు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

అవసరమైన చోట తాగునీటి బోర్లు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపాల్టీలో రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తున్నట్లు కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈనెల 15న ప్రజాశక్తిలో ప్రచురితమైన 'తాగునీటి కష్టాలు తీరేనా' అన్న వార్తకు శుక్రవారం ఆయన స్పందిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. మంచినీటి సరఫరా జరగని ప్రాంతాల్లో వాటర్ ట్యాంక్ ద్వారా నీరు సరఫరా చేస్తున్నామని అన్నారు. అంతేకాకుండా కొత్తగా అవసరమైన చోట బోర్ వెల్స్ వేసేందుకు కౌన్సిల్ అనుమతి కొరకు అంచనాలు తయారు చేశామని, ఆమోదం పొందిన తక్షణమే అవసరమైన చోట తాగు నీటి బోర్లను వేయడం జరుగుతుందని తెలిపారు.

రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి - పాలకొండ

ప్రభుత్వం చేపడుతున్న రీసర్వేతో భూ సమస్యలు తొలగి భూ యజమానులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. మండలంలోని చిన్నమంగళా పురం పైలట్ గ్రామంగా తీసుకొని నిర్వహిస్తున్న రీ సర్వే ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రైవేటు భూములతో పాటు గ్రామ సరిహద్దులు, నీటి వనరులు గల భూములు పోరంబోకు భూములను కొలతలు వేసి ఖచ్చితమైన సరిహద్దులను ఏర్పాటు చేస్తారన్నారు. తద్వారా రైతులకు, భూ యజమానులకు శాశ్వత మేలు జరుగుతుందన్నారు. రైతుల సమక్షంలోనే భూమి కొలతలు కొలిచి హద్దులు నిర్ణయిస్తారన్నారు. సర్వే బృందం భూ యజమానులతో పాటు చుట్టుపక్కల భూమి యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నదీ, లేనిదీ రైతులను అడిగి ఆరా తీశారు. రీ సర్వేలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులకు అడగ్గా సర్వే సక్రమంగా జరుగుతుందని రైతులు సమాధానం చెప్పడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు జరిగిన రీ సర్వే వివరాలను తహశీల్దార్ బాలమురళీకృష్ణను ప్రశ్నించగా 740 ఎకరాలకు రీ సర్వే నిర్వహించాల్సి ఉండగా 584 ఎకరాల వరకు సర్వే పూర్తి అయినట్లు కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ అందరి బాధ్యత అని ఆక్రమణలకు గురికాకుండా కఠినంగా వ్యవహరించాలని రెవెన్యూ అధికారులకు కలెక్టర్ సూచించారు. రైతులతో మాఖా ముఖీ మాట్లాడారు. ఈ ప్రాంతంలో సాగుచేస్తున్న పంటలు, ఆదాయ మార్గాలను అడిగి తెలుసుకున్నారు. చెరుకు సాగు గిట్టుబాటు కావడం లేదని తెలపగా ఉపాధి హామీ పథకం కింద పామాయిల్ సాగు లాభదాయకంగా ఉంటుందని ఆ దిశగా ఆలోచనలు చేయాలని సూచించారు. రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా అధిక ఆదాయం వచ్చే పంటల సాగు పై దష్టికేంద్రీకరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి యశ్వంత్ కుమార్‌రెడ్డి, ఉప తహశీల్దార్ సన్యాసిరావు, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, గ్రామ సర్వేయర్ నెల్లి శివ, విఆర్ఒ పి.రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.


సర్వే వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

సీతారామస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

స్థానిక సీతారామస్వామి ఆలయ అభివృద్ధికి తను కషి చేస్తానని కలెక్టర్ శ్యాం ప్రసాద్ అన్నారు. సీతారాం స్వామి ఆలయ ధ్వజస్తంభం ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆయన ఆలయానికి వచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను ప్రత్యేకంగా ఆహ్వానించి దగ్గరుండి ఆలయంలో పూజలు చేయించారు. సీతారామస్వామి ఆలయ ప్రధాన అర్చకులు శేషుబాబు దగ్గరుండి పూజలు చేసే ఆలయ విశిష్టత వివరించారు. ఆలయం చూసి ఎంతో సంతోషించారు. ఇలాంటి పురాతన ఆలయాలు అభివద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు

పారదర్శకంగా ప్రజారోగ్య పర్యవేక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ప్రజారోగ్యమే ధ్యేయంగా ఆరోగ్య కార్యక్రమాలు పక్కాగా అమలు చేస్తూ, మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులకు శుక్రవారం స్థానిక ఎన్‌జిఒ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. అసాంక్రమిక, దీర్ఘకాలిక వ్యాధులు గుర్తించేందుకు చేపడుతున్న ఎన్‌సిడి 3.0 సర్వే పారదర్శకంగా నిర్వహించి రక్తపోటు, మధుమేహం, హృద్రోగ సమస్యలు, క్యాన్సర్ తదితర వ్యాధి లక్షణాలు గుర్తించడంపై దృష్టి సారించాలన్నారు. వ్యాధిగ్రస్తులకు సకాలంలో తగు చికిత్స అందించాలని, అందుకు గల కారణాలపై విశ్లేషించి ఆహారపు అలవాట్లు, జీవనశైలిపై అవగాహన కల్పించడం తద్వారా ఏ మేరకు వారి ఆరోగ్య మెరుగుపడుతుందో పర్యవేక్షణ చేయాలని అన్నారు. అలాగే లెప్రసీ సర్వే, స్కూల్ హెల్త్, అంగన్వాడీ, టిబి స్క్రీనింగ్ చేపట్టి వ్యాధి లక్షణాలు గుర్తించిన వారి ఆరోగ్యం మెరుగుకు కార్యాచరణ చేయాలన్నారు. హెల్త్ సూపర్వైజర్లు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి ఆరోగ్య సమాచారం తెలుసుకోవాలన్నారు. హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణ చేయాలన్నారు. రక్తహీనత నివారణకు కృషి చేయాలని, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తుల ఆరోగ్యాన్ని తరచుగా పర్యవేక్షించాలన్నారు. జ్వరాలు, డయేరియా తదితర వ్యాధి లక్షణాలు ఎక్కడైనా గుర్తిస్తే ఉన్నతాధికారులకు సత్వరమే తెలియజేసి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణీ, శిశు ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి అని పేర్కొన్నారు. సిబ్బంది సమన్వయ లోపం లేకుండా పనిచేస్తూ, ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో డిఐఒ డాక్టర్ ఎం.నారాయణరావు, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్‌మోహనరావు, డాక్టర్ ఎం.వినోద్ కుమార్, డా పి.శ్రీధర్, డిఎస్ఒ శంకర్, డిపిహెచ్ఎన్ఒ ఉషారాణి, డిపిఒ లీలారాణి, డెమో సన్యాసిరావు తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యేకు వినతిన అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

గిరిజన సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

ఈనెల 24 నుంచి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో జిల్లాలోని గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావనకు తీసుకొచ్చి పరిష్కరించాలని ఎపి గిరిజన సంఘం నాయకులు స్థానిక ఎమ్మెల్యే బోనాల విజయచంద్రను కోరారు. ఈ మేరకు ప్రజాసంఘాల నాయకులు ఎమ్మెల్యేకు వినతి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ షెడ్యూల్ ఏరియాలో జీవో 3 ఉండడంతో 19 శాఖల్లో 34 రకాల ఉద్యోగ అవకాశాలు ఆదివాసీలకు హక్కుగా ఉండేదని, ఆ జీవో రద్దు కావడంతో ఆదివాసీలకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏకలవ్య, ఐసిడిఎస్ తదితర శాఖల్లో మైదాన ప్రాంత గిరిజనేతరులు వచ్చి ఉద్యోగం పొందడంతో ఆదివాసీ నిరుద్యోగులు తీవ్ర నిరాశతో ఉన్నారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీతో ఆదివాసీలకు న్యాయం జరిగిందన్నారు. అరకులో జరిగిన ఎన్నికల సభలో ముఖ్యమంత్రి జీవో నెంబర్3కు చట్టబద్ధత కల్పిస్తానని, ఏజెన్సీ స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తానని, జీడికి మద్దతు ప్రకటిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈనెల 24 నుంచి జరగన్న అసెంబ్లీ సమావేశాల్లో జీడిపిక్కలకు మద్దతు ధర, జిఒ 3కు చట్టబద్ధ కల్పించి షెడ్యూల్ ఏరియాలో గిరిజనులతో 100శాతం ఉద్యోగ ,ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తే ప్రస్తావించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. వినతిని అందజేసిన వారిలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.రామస్వామి, మండల నాయకులు కద్రక చిరంజీవి, తాడంగి కృష్ణ, పాలమెట్ట రాము, సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, బి.సూరిబాబు, డివైఎఫ్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనపై వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

పేదరిక నిర్మూలన అన్న అంశంపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర)లో శుక్రవారం మండల విద్యాశాఖాధికారులు 1,2 డి.గౌర్నాయుడు, ఆర్.ఆనందరావు పర్యవేక్షణలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 6,7 తరగతులు జూనియర్లు గానూ, 8,9 తరగతులు సీనియర్లుగా విభజించారు. పెయింటింగ్లో జూనియర్లు నడిమికెళ్ల ఎంపీయుపి పాఠశాలకి చెందిన ఏడో తరగతి విద్యార్థి సిహెచ్ ఆరాధ్య, సీనియర్ విభాగంలో నర్సిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి ఆశ్రిత గెలుపొందారు. వ్యాసరచన పోటీల్లో జూనియర్ విభాగంలో కిమ్మీ ఎంపియుపి పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థి జి.మోహన్‌నాయుడు, సీనియర్స్ విభాగంలో నర్సిపురం జెడ్పీ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కె.సుస్మిత, వక్తృత్వ పోటీల్లో జూనియర్ విభాగంలో కంబర వలస జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థిని వి.మేదప్రజ్వల, సీనియర్ విభాగంలో నడిమికెళ్ల ఎంపియుపి పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎం.చారుశ్రీ విజేతలు నిలిచారు. మండల స్థాయి పోటీ పరీక్షలకు హాజరైన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వీరంతా పార్వతీపురంలో శనివారం జరుగు జిల్లా స్థాయి పోటీలకు హాజరుకావాలని, పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి : పేదరికం లేని భారతదేశం అన్న అంశంపై పాఠశాల విద్యార్తులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. పాత్రుడు ఆధ్వర్యంలో జరిగినట్టు ఎంఇఒ-2 కొండలరావు తెలిపారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సిహెచ్.చిరంజీవిలు, చిన్నారావు, ఎస్ నరసింహులు వ్యవహరించారు. వ్యాసరచన పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.హర్షవర్ధన్ నిలువగా, రెండో స్థానంలో కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.గౌరీశ్వరి, మూడో స్థానాన్ని ఎపిఎస్ డబ్ల్యు ఆర్ ఎస్ పాఠశాలకు చెందిన వై.అలేఖ్య నిలిచారు. అలాగే డ్రాయింగ్ పోటీల్లో గరుగుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.లికిత ప్రథమ, జ్ఞానేష్ సాయి ద్వితీయ స్థానం సాధించగా, రావుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఒ.గౌరి తృతయస్థానం సాధించాడు. వక్తృత్వ పోటీల్లో గరుగుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన దినేష్ ప్రథమ, కొత్తూరు హైస్కూల్‌కు చెందిన పి.యామిని ద్వితీయ, ఉల్లిభద్ర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన జి.అవినీష్ తృతీయ స్థానాలు సాధించినట్లు తెలిపారు. మండల స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థిని, విద్యార్థులు జిల్లా స్థాయిలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సిఆర్ఎంటి బోను రామకృష్ణ, ఉపాధ్యాయులు శంకర్రావు పాల్గొన్నారు.

వైసిపి అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గ వైసిపి అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర సిఫార్సు మేరకు అధినేత జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల ప్రకారం అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. యువజన విభాగానికి అధ్యక్షునిగా పి.అచ్చుతరావు, మహిళా విభాగం బోదంకి పరిమళ, రైతు విభాగం ఎల్.అప్పలనాయుడు, బిసి సెల్ సలాది అప్పలనాయుడు, ఎస్సీ సెల్ మజ్జి అప్పారావు, ఎస్టీ సెల్ నెమలిపిట్ట కళ్యాణ్, మైనారిటీ సెల్ మహమ్మద్ అబ్దుల్ హక్, క్రిష్టియన్ మైనారిటీ జి.సూర్యనారాయణ, విద్యార్థి విభాగం సింగిరెడ్డి అశోక్, పంచాయతీ రాజ్ పి.సూర్యనారాయణ, మున్సిపల్ విభాగం కొల్లి వెంకటరమణ, ఆర్‌టిఐ విభాగం పిరిడి రామకృష్ణ, వాలంటీర్ల విభాగం బి.పైడిరాజు, గ్రీవెన్స్ సెల్ మేకల శంకరరావు, వాణిజ్య విభాగం కె.సత్యనారాయణ, వైఎస్సార్ టియుసి వి.నాగభూషణరావు, లీగల్ సెల్ బి.రామచంద్రరావు, సాంస్కృతిక విభాగం కె.ఈశ్వరరావు, సోషల్ మీడియా విభాగం ఎం.పైడిపునాయుడు, ఐటి విభాగం, ఎల్.శ్యామలరావు, దివ్యాంగుల విభాగం పి.అచ్చిబాబు, డాక్టర్స్ విభాగం పీ.సత్యం, ప్రచార విభాగం కె.త్రినాధరావు, మేధావుల ఫోరం ఎ.సంధీప్,బూత్ కమిటీల విభాగం అధ్యక్షుడిగా ఎం.మధుసూధనరావు నియామక మయ్యారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ ప్రాంతంలో రైతులకు తక్కువ ఆదాయం ఎక్కువ దిగుబడినిచ్చే ప్రకృతి వ్యవసాయ పంటలు పండించి ఆర్థిక అభివృద్ధి చెందాలని యూనిట్ ఇన్చార్జి కిమిడి భూషణ కోరారు. మండలంలోని లక్కగూడ పంచాయతీ మొరమలో ప్రకృతి వ్యవసాయ రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ పద్ధతిలో పుల్లటి మజ్జిగ తయారీ విధానం పై అవగాహన కల్పించారు. జీడి, మామిడి తోటలకు పూత రాలకుండా పూత, పిందే మాడిపోకుండా ఆకుమచ్చలు తెగులు, కాయ మచ్చ తెగులు, బూజు తెగులు నివారణకు పుల్లటి బాగా పనిచేస్తుందన్నారు నాణ్యమైన పిక్కలు మంచిదిగుబడి సాధించేందుకు ఈ పుల్లటి మజ్జిగను గ్రామ స్థాయిలో మహిళా సంఘాలకు సమావేశం ఏర్పాటు చేసి ప్రకతి వ్యవసాయ పద్ధతులను, కిచెన్ గార్డెన్ పెరటి తోటలో వాటిపై అవగాహన కల్పించారు.

సిరిమాను చెట్టు సిద్ధం

ప్రజాశక్తి - సాలూరు

మే నెలలో జరుగు శ్యామలాంబ పండుగ నేపథ్యంలో సిరిమాను చెట్టును ఉత్సవ కమిటీ సభ్యులు సిద్ధం చేశారు. శుక్రవారం ఉదయం ఆర్‌సిఎం పాఠశాల వెనుక ఉన్న పాచి చెట్టును సిరిమాను కోసం తీశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ అక్కేన అప్పారావు, సభ్యులు సిగడాపు బంగారయ్య, విక్రం చంద్రసన్యాసి రాజు, అక్కేన ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు మక్కువ మండల సమావేశం

ప్రజాశక్తి - మక్కువ

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ డిడి స్వరూపరాణి తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులంతా హాజరు కావాలని ఆమె కోరారు. అనంతరం మండలంలోని ఎస్.పెద్దవలస పంచాయతీ సచివాలయాన్ని కూడా సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డబ్ల్యూహెచ్ఎస్ పనులను పరిశీలించడంతో పాటు సూర్యఘర్ మిగిలిన సర్వేలను కూడా పరిశీలించినట్లు ఆమె తెలిపారు

ఆనపకాయ గూడలో 20 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ఆనపకాయగూడలో 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వై.అమ్మనరావు తెలిపారు. సారా విక్రయించినా, తయారుచేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటుసారా రవాణా చేసిన వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ పెన్షన్‌దారుల అధ్యక్షులుగా సుబ్బారావు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ప్రభుత్వ పెన్షనదారుల అధ్యక్షులుగా కొండగొర్రె సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డివిజన్ ఎన్జీవో అధ్యక్షుడు రంగాచారి, డిటిఒ మన్మధరావు ఆధ్వర్యంలో ఎన్నిక బాడీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షన్‌దారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వీరికి చౌదరినాయుడు, రామకృష్ణ, వండన అప్పలనాయుడు, డిఎస్ఒ అప్పారావు సబ్‌అస్టెంట్ కె.కాంతారావు తదితర ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.


సుబ్బారావు అభినందిస్తున్న ఉద్యోగులు

రోడ్డు భద్రత పై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ధోనుబాయి జంక్షన్ వద్ద సీతంపేట ఎస్సై వై.అమ్మనరావు ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించడానికి యువత సహకరించాలని కోరారు. మితిమీరి వేగంతో వెళ్లరాదన్నారు. వాహనం ఫిట్నెస్‌గా ఉండాలని చెప్పారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మైనర్లు వాహనాలు తీయరాదని చెప్పారు. వాహనానికి సంబంధించి అన్ని ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లు http:bie. ap.gov.in, మన మిత్రలో హాల్ టికెట్ నెంబర్ అండ్ ఆధార్ నెంబర్ కొట్టి డౌన్లోడ్ చేసుకోవచ్చని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇంటర్ పరీక్షలకు వెళ్లే విద్యార్థులు హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకొని పరీక్షలకు సన్నద్ధం కావాలని కోరారు.

సోప్‌పిట్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో ఉపాధి హామీ చట్టం నిధులతో చేపట్టనున్న సోప్ పిట్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎపిఒ గౌరీనాథ్ సిబ్బందికి సూచించారు. అలాగే వర్షం నీరు భూములోకి ఇంకించే ఇంకుడు గుంతలు నిర్మా ణం పనులు మంజూరయ్యాయన్నారు. ఈ మేరకు గ్రామపంచాయతీలు వారీగా సోప్ పిట్ ల నిర్మాణాలకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లకు లక్ష్యాలను నిర్దేశించామన్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం ప్రారంభ మైన సోప్ ఫిట్ లు వేగవంతం చేయాలన్నారు. ఇప్పటికే క్షేత్ర సహాయకులకు తెలియజేశామన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి ఏడాది జైలు

విజయనగరం : ఎస్.కోట పోలీసు స్టేషనులో 2019 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడు ఎస్.కోట మండల కేంద్రానికి చెందిన వసంత రామకృష్ణ (26)కు విజయనగరం పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె..నాగమణి ఏడాది జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. రామకృష్ణ 2019లో 9వ తరగతి చదువుతున్న బాలికను నమ్మించి మోసం చేసి లైంగిక నేరానికి పాల్పడ్డాడని ఎస్.కోట పోలీసు స్టేషనులో ఫిర్యాదు నమోదైంది. అప్పటి సిఐ బి.శ్రీనివాసరావు దర్యాప్తు చేసి, నిందితుడ్ని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

చేపల వేటకు వెళ్లి నీటమునిగిన మత్స్యకారుడు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

చేపల వేటకు వెళ్లివస్తుండగా స్పృహ తప్పిపోవడంతో మత్స్యకారుడు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పార్వతీపురం మండలం కోటవానివలసకు చెందిన అల్లు ఆదినారాయణ అనే మత్స్యకారుడు శుక్రవారం తోటపల్లి రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో స్పహ కోల్పోయి నీటిలో పడిపోయాడు. అది చూసి పక్కనున్న మిగిలిన మత్స్యకారులు వెంటనే ఒడ్డుపైకి తీసుకొచ్చి 108 ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అతడ్ని వైద్యులు పరీక్షించి కోమాలోకి వెళ్లిపోయాడని మెరుగైన వైద్యం కోసం విజయనగరం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడి వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి...మాజీ సర్పంచ్ బంటుదాసు

మత్స్యకారుడు అల్లు ఆదినారాయణకు మెరుగైన వైద్యమందించాలని అతని కుటుంబాన్ని ఆదుకోవాలని పార్వతీపురం ఐటిడిఎ మొను అడ్డాపుశీల పంచాయతీ మాజీ సర్పంచ్ బంటు దాసు డిమాండ్ కోరారు. కోటవానివాలస శ్రీ వెంకటేశ్వర మత్స్యకారుల సంఘంలో ఆదినారాయణ ఒక సభ్యుడని, కావున సంఘం ద్వారా కూడా ఆదుకోవాలని, అలాగే మత్సశాఖ ఎడి కూడా తమ శాఖ ద్వారా ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

పలువురికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - కొమరాడ

అదుపుతప్పి ఆటో బోల్తా పడి పలువురికి స్వల్ప గాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని పెద్దశాఖ గ్రామం నుంచి పార్వతీపురం వైపు ఎక్కువ మంది ప్రయాణికులతో వెళు_న్న ఆటో సోమినాయుడు వలస సమీపంలో అదుపు తప్పి పంట పొలాల్లోకి బోల్తా పడింది. ఈ ఘటనలో పెద్దశాఖకు పలువురు గిరిజనులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద జరిగిన సమయంలో ఆటో బోల్తాపడిన పొలంలో నీరు ఉండడంతో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారని స్థానికులు తెలిపారు. ఏది ఏమైనా మండలంలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఆటోలో ప్రయాణికుల సంఖ్య పరిమితికి మించి అధికంగా ప్రయాణించడంతో ప్రమాదాలకు కారణమవుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. జిల్లా ఏర్పడిన తర్వాత రోడ్డు రవాణాశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ చర్యలు కొన్ని సందర్భాల్లో తీసుకోకపోవడంతో ఆటో డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణ కూడా ఉన్నాయి. ఏది ఏమైనా అధికారుల నిఘా కొరవడినట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అధిక లోడులను నియంత్రించి అన్ని ధ్రువీకరణ పత్రాలు సక్రమంగా ఉంటేనే ఆటోలు రాకపోకలు చేసేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.


పొలాల్లో బోల్తాపడిన ఆటో

అతివేగం, మితిమీరిన లోడులతో ప్రమాదం : సిపిఎం

మండలంలోని ఆటోలు, లారీలు మితిమీరిన వేగంతో పాటు పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్లడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని సిపిఎం కొల్లి సాంబమూర్తి అన్నారు. శుక్రవారం జరిగిన ఆటో ప్రమాద ఘటనను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు కారణం ముఖ్యంగా ఆటోలు, ఇతర వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తున్న సందర్భాల్లో అధికశాతం ప్రమాదాలు బారిన పడుతున్నారని అన్నారు. అలాగే అంతర్రాష్ట్ర రహదారిపై మితిమీరిన లోడులతో భారీ వాహనాలు అతివేగంగా వెళ్లడంతో అనేకసార్లు ప్రమాదం జరిగి ఎంతోమంది మృతి చెందే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరంతరం పర్యవేక్షణ చేసి నిర్లక్ష్యంగా వ్యవహరించి, నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.